ప్రపంచాన్ని భయపెడుతున్న ఎలక్ట్రానిక్ వేస్టేజ్

రిటైర్డ్ మేజర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ భక్తియార్ చౌదరి

రాయదుర్గం: ప్రపంచాన్ని భయపెడుతున్న అతి పెద్ద సమస్య ఎలక్ట్రానిక్ వేస్టేజ్ అని రిటైర్డ్ మేజర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ భక్తియార్ చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 'ఇన్నోవేషన్ టెక్నాలజీ'పై రెండు రోజులపాటు సాగిన అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈవేస్ట్ మేనేజ్‌మెంట్ లో గత మూడు దశాబ్దాలుగా చేసిన పరిశోధనలో 2022 చివరి నాటికి ప్రపంచంలో 66 బిలియన్ టన్నుల ఈ వేస్ట్ ఉత్పత్తి కాగా, ఇందులో 31 బిలియన్ టన్నుల మెటల్స్, 21 బిలియన్ టన్నుల ప్లాస్టిక్ వేస్టేజ్, మరొక 14 బిలియన్ టన్నుల మెటీరియల్స్ వేస్టేజ్ ఉందని వివరించారు. ఏటా 2.6 మిలియన్ టన్నుల ఎలక్ట్రానిక్ వేస్టేజ్ ఉత్పత్తి కావడం వలన భూమి, సముద్రాలు, నదులు, చెరువులు అన్నీ కూడా కలుషితం అవుతున్నాయన్నారు. వచ్చే రెండ వతరానికి ఈ వేస్టేజ్ తప్ప మనం భూమి మీద పండించే ఆహారపదార్థాలు ఏమీ ఉండవని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో ఖనిజాలు ప్రధానపాత్ర

దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో భూమిలో దొరికే ఖనిజాలు ప్రధానపాత్ర పోషిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్‌కుమార్ పేర్కొన్నారు. ఇనుము, మాంగనీస్, టిటేనియం, మైకా, లైమ్‌స్టోన్ తదితర మినరల్స్‌ను వెలికి తీయాలంటే ఇంజినీరింగ్ టెక్నాలజీ ద్వారా కోట్లాది టన్నుల ఉత్పత్తిని సాధిస్తున్నామన్నారు. ఇలాంటి అంతర్జాతీయ సమా వేశాల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సు ముగింపు వేడుకలో సర్టిఫికెట్లు పొందిన వారితో అతిథులు

రోడ్డు వేశారు.. సెంట్రల్ లైటింగ్ మరిచారు



నల్లగండ్ల హుడా కాలనీ రవీందర్‌రెడ్డి గార్డెన్ నుంచి హిమసాయి లేక్ వ్యూ రోడ్డు

- లైటింగ్ సదుపాయం లేక రాత్రివేళలో చీకట్లు
- పాదచారులు, మహిళలు అటుగా వెళ్లాలంటే జంకే పరిస్థితి
- ప్రధాన రహదారి కావడంతో రాత్రి వేళ లైట్ల అవసరాన్ని గుర్తించాలి
- ఇదీ నల్లగండ్ల హుడాకాలనీలో రోడ్డులో లైటింగ్ పరిస్థితి

శేరిలింగంపల్లి: రోడ్డు వేశారు కానీ సెంట్రల్ లైటింగ్ మరిచిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నల్లగండ్ల హుడాకాలనీలో రవీందర్‌రెడ్డి గార్డెన్ నుంచి హిమసాయిలేక్‌వ్యూ అపార్ట్ మెంట్ వరకు 100 అడుగుల రోడ్డును హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఏడాది క్రితం అభివృద్ధి చేశారు. ఈ కాలనీలోనే కాకుండా చుట్టూ ఉండే ప్రాంతాలలో కూడా ఉద్యోగులు, వ్యాపార, వాణిజ్య రంగాలకు చెందినవారే అధికంగా నివాసం ఉంటున్నారు. దీంతో వారంతా వాహనాలనే వినియోగిస్తున్నారు.

ఇదే ప్రధాన రోడ్డు..

నల్లగండ్ల హుడాకాలనీలో రోజురోజుకూ అపార్ట్‌మెంట్లు పెరిగిపోతున్నాయి. దీనికి తోడు చుట్టూ ఉండే ప్రాంతాలలో అపార్ట్‌మెంట్ కల్చర్, గేటెడ్ కమ్యూనిటీలు కూడా గణనీయంగా పెరిగిపోయాయి. అదేవిధంగా గోపన్‌పల్లి, గౌలిదొడ్డి, నానక్‌రాం గూడ, గచ్చిబౌలి, ఖాజాగూడ సాఫ్ట్‌వేర్ సంస్థలు ఉండటం వాటిలో పనిచేసే ఉద్యోగులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. 100 అడుగుల రోడ్డు కావడం, వాహనాల రాకపోకలు పెరిగిపోవడంతో సెంట్రల్ లైటింగ్ ఎంతో ముఖ్యంగా మారింది. దీనికితోడు ఈ రోడ్డులో రాత్రి వేళల్లో నడవాలంటే పాదచారులు ముఖ్యంగా మహిళలు జంకాల్సిన పరిస్థితి నెలకొంది.


నల్లగండ్ల హుడా కాలనీ వంద ఫీట్ల రోడ్డులో రాత్రి చీకటి దృశ్యం

తక్షణం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేలా చూడాలి


ప్రధానరోడ్డు కావడంతో సెంట్రల్ లైటింగ్ ఆవశ్యకత ఎంతైనా ఉంది. అధికారులు చొరవ తీసుకొని వెంటనే సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసేలా చూడాలి. తెల్లవారుజామున, రాత్రి వేళ వాకింగ్ కూడా ఈ రోడ్డులో చేయాలంటే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. ఆధునిక తరహాలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు తక్షణం చర్యలు చేపట్టాలి – వసంత కుమార్ యాదవ్, నల్లగండ్ల

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రశాంత్‌నగర్, సఫారీనగర్, కొత్తగూడ విలేజ్, 8 వ పోలీస్ బెటాలియన్ , కొండాపూర్, జూబ్లీ గార్డెన్, భిక్షపతినగర్, గోల్డెన్ తులీప్, రాఘవేంద్ర కాలనీ ఏ,బీ,సీ బ్లాక్‌లు, రాజరాజేశ్వరీ కాలనీ, హనుమాన్‌నగర్, సైబర్ వ్యాలీ, గోపాల్‌రెడ్డి నగర్, అపర్ణ, హఫీజ్‌పేట్, జాగృతినగర్, శ్రీనివాస్‌కాలనీ, ఆనంద్‌నగర్ కాలనీ, మీనాక్షీ అపార్ట్‌మెంట్స్, శిల్పపార్క్, టీసీఎస్, ఇజ్జత్‌నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డిసెంబర్ 1న బాలబృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం బాలబృందావనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'టీమ్ వర్క్ మేక్స్ డ్రీమ్ వర్క్' అనే అంశంపై నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్ళ వయస్సు కలిగిన వారికి అవకాశం కల్పిస్తారు. వివరాలకు 040-23001234 నెంబరుకు ఫోన్ చేయాలని నిర్వాహకులు కోరారు.

శేరిలింగంపల్లి అభివృద్ధికి కృషి చేస్తా


సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. నెహ్రూనగర్, గోపీనగర్‌లలో అధికారులతో కలిసి నాగేందర్ యాదవ్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సైడ్‌కు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ భాస్కర్, లైన్ ఇన్స్‌పెక్టర్ శ్యామ్ పాల్గొన్నారు.

భరోసా ఇచ్చేలా పనిచేయాలి


గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

- మంత్రి శ్రీధర్‌బాబు
- పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరించిన మంత్రి

పటాన్‌చెరు టౌన్: రాష్ట్రానికి, ప్రజలకు సేవ చేయడానికి పోలీసు ఉద్యోగం గొప్ప అవకాశమని, ప్రజలకు భరోసా ఇచ్చేలా పనిచేయాలని శిక్షణ పూర్తిచేసుకున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లను ఉద్దేశించి మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. శుక్రవారం అమీన్‌పూర్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్ల నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌కు రాష్ట్ర హోం ప్రిన్సిపాల్ సెక్రెటరీ డీజీపీ రవి గుప్త, ఎస్పీఎఫ్ డీజీపీ అనిల్ కుమార్, ఎస్పీఎఫ్ డీఐజీ మాధవరావులతో కలసి మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాసింగ్ అవుట్ పరేడ్‌లో మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..విధుల్లో రాణించేందుకు పోలీసులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందన్నారు. రాష్ట్ర భద్రత, పురోగతి పోలీసుల చేతుల్లోనే ఉందని, బాధ్యతలు నిర్వర్తించే సమయంలో క్రమశిక్షణతో, అంకితభావంతో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ అధికారులు పాసింగ్ అవుట్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆలయాలకు సంపూర్ణ సహకారం

జిన్నారం(పటాన్‌చెరు): ఆలయాలకు తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నల్తూరు గ్రామంలోని శివాలయంలో బీఆర్‌ఎస్ నాయకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించనున్న నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనకు రూ. 30 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువత నాయకులు వెంకటేశంగౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు రాజేష్, నాయకులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


శివాలయంలో నాయకుల ప్రత్యేక పూజలు

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో వేద పండితులు వామనభట్ల ప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో చేపట్టిన కార్తీక మహోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తీకమాసంలో మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో భక్తుల పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

రుద్రాక్షలతో కాశీవిశ్వేశ్వరుడికి అలంకారం


రాయదుర్గం: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వరస్వామికి అర్చనలు, ప్రత్యేక పూజలు, రుద్రాక్షలు, పూలతో ప్రత్యేకంగా ఆలయ అర్చకుల పర్యవేక్షణలో అలంకారం చేశారు. అనంతరం ఆలయంలోని గణపతి, ఆంజనేయ స్వామి, షిర్డీసాయిబాబా,అన్నపూర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం రాత్రి వేళ ఆలయంలో ఆకాశదీపం వెలిగించడంతోపాటు దీపాలంకరణ కార్యక్రమాన్ని భక్తుల స్వహస్తాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ


చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ సాయిబాబా దేవాలయంలోని అయ్యప్ప స్వామి పడిపూజలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నల్ల సంజీవ రెడ్డి, యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం మేరకు.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఎనిమిది మంది మద్యం తాగి వాహనాలు పట్టుబడ్డారు. వీరిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా, ఒకరికి రూ.1,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

లీ-ఫార్మా పరిశ్రమకు పీసీబీ నోటీసులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లీ-ఫార్మా పరిశ్రమ తీరును హెచ్చరిస్తూ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం పరిశ్రమకు నోటీసులు జారీ చేశారు. గతంలో పరిశ్రమ నుంచి పైపుల ద్వారా బహిరంగ ప్రదేశాల్లోకి నీటి విడుదల, వాయు కాలుష్యంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతూ పీసీబీ అధికారులను కలసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పీసీబీ యంత్రాంగం పరిశ్రమను హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడితే ముందస్తు నోటీసులు లేకుండా పరిశ్రమను మూసివేస్తామని హెచ్చరించారు.

ఆదాయం కంటే ప్రయాణికుల భద్రతే ముఖ్యం

ఆర్టీసీ సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ కెఎస్ ఖాన్

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ సంస్థకు ఆదాయం కంటే ప్రయాణికుల భద్రతే అత్యంత ముఖ్యమని ఆర్టీసీ సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ కె.ఎస్.ఖాన్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో గురువారం రాత్రి ఆర్టీసీ సంస్థ సికింద్రాబాద్ రీజియన్ పరిధిలో 11 డిపోల పరిధిలో 23 మంది ఉద్యోగులకు ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాలు పంపిణీ చేశారు. ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఉద్యోగు లందరిపై కూడా ఉందన్నారు. హెచ్‌సీయూ డిపోమేనేజర్ ఎం మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

వేగంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు


ఆస్పత్రి వైద్య బృందంతో పాటు సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రంలోని టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి అందరి సమష్టి కృషి వల్లే ఉత్తమ సేవల విభాగంలో జాతీయస్థాయిలో ఏడవ స్థానం లభించిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రూ. 350 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో మహిపాల్‌రెడ్డి వైద్యులు, వైద్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...20 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి దివంగత మహానాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఏరియా ఆస్పత్రికి జీవోను ఇచ్చారన్నారు. 2012లో ఆస్పత్రి ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు అన్ని రకాల నాణ్యమైన వైద్యసేవలు అందిస్తూ ప్రజల మన్ననల్ని పొందుతోందని తెలిపారు. త్వరలోనే ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి గాయత్రి, డీసీహెచ్‌ఎస్ అధికారి సంగారెడ్డి, ఏరియా ఆస్పత్రి వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ప్రజావసరాలకే వినియోగించాలి

మణికొండ: ప్రజావసరాల కోసం నిర్దేశించిన సెప్టిక్‌ట్యాంక్, పార్కు స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన అనుమతులను రద్దు చేసి వాటిని పరిరక్షించాలని ప్రజలు డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 22/పి, 23, 24, 25, 26లలో వెంకటేశ్వర కాలనీ లేఅవుట్ వేశారు. మొదటగా అప్పటి హుడాకు లేఅవుట్ దరఖాస్తు చేయగా పలు కారణాలతో మంజూరు కాలేదు. దాంతో పంచాయతీ అనుమతులతో ఏర్పాటు చేశారు. లేఅవుట్ హెచ్‌ఎండీఏ నిబంధనల మేరకు ఉండటంతో దాన్ని అలాగే పరిగణించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సదరు లేవుట్‌లోని పార్కులు, ఓపెన్ స్థలాలను రియల్టర్లు అమ్మకాలు చేపట్టారు. వాటిల్లో భాగంగా కొంత స్థలాన్ని సెప్టిక్‌ట్యాంక్‌కు కేటాయించారు. అలాంటి స్థలానికి లేఅవుట్‌లో లేని 336, 337 నెంబర్లు వేసి అమ్మకాలు నిర్వహించారు. లేఅవుట్ నిబంధనలు పట్టించుకోకుండా ఇరిగేషన్‌శాఖలోని ఓ అధికారి తప్పుడు నివేదికల ఆధారంగా ఏకంగా హెచ్‌ఎండీఏ భవన నిర్మాణ అనుమతులు జారీ చేసింది. సదరు స్థలం పక్కనుంచి ఉన్న పందెన్‌వాగుకు నిబంధనల ప్రకారం 9 మీటర్లు బఫర్ వదలాల్సి ఉండగా కేవలం 2 మీటర్లు మాత్రమే వదలి అనుమతులు ఇచ్చారు. దాంతో కాలనీ వాసులు నిబంధనలకు విరుద్ధంగా ఇరిగేషన్ శాఖ తప్పుడు ఎన్‌ఓసీతో ఇచ్చిన అనుమతులను రద్దు చేసి ప్రజలకు ఉపయోగపడే స్థలాన్ని కాపాడాలని కాలనీవాసులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. హైడ్రా కమిషనర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి, కాలనీ వాసులు సందీప్, జస్వంత్, అష్రఫ్, నాగరాజు, మల్లికార్జున్‌రెడ్డి, స్వప్న, సుజాత, రాధిక, పారిజాత, అనిత, నరసింహారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

ఖాజాగూడ చెరువులో మట్టిపోస్తున్న వారిపై కేసు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ పెద్ద చెరువులో మట్టిపోస్తున్న వారిపై రాయదుర్గం పోలీసులు గురువారం కేసు నమోదు చేసినట్లు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మూడు జేసీబీలను పోలీసులు సీజ్ చేశారు. చేరువల భాగ్యనగర్ గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణానికి జరిపిన తవ్వకాల మట్టిని దగ్గరలోనే ఉన్న ఖాజాగూడ చెరువులో పోసుతన్నట్లు హైడ్రా ఆర్‌ఎఫ్ నిఘా బృందం గుర్తించింది. ఈనెల 27వ తేదీన రాత్రి పూట మట్టినింపుతున్న వాహనాలను హైడ్రా బృందం పట్టుకుంది. వెంటనే ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఆ శాఖ అధికారులు 28వ తేదీని రాయదుర్గం పోలీసులకు ఇదే విషయమై ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు మూడు జేసీబీలను సీజ్ చేశారు. భాగ్యనగర్ గ్యాస్ పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కిరణ్‌పై కేసును పోలీసులు నమోదు చేశారు. రాయదుర్గం పోలీసులు కేసును విచారిస్తున్నారు.

ఖాజాగూడలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణ


బీఆర్‌ఎస్ పార్టీ పతాకావిష్కరణ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాయిబాబా, నాయకులు

రాయదుర్గం: బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 'దీక్షాదివస్'ను పురస్కరించుకొని ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ఉద్యమం, మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించిన పాత్రను గుర్తుకు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు చెన్నం రాజు,నరేష్, జంగయ్య యాదవ్,రమేష్‌గౌడ్, అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

మియాపూర్ -2 డిపోలో వనభోజనాలు


ఆర్టీసీ ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్ -2 డిపోలో కార్తీకమాసం సందర్భంగా కార్తీక వనభోజనాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డిపో ఉద్యోగులు, కార్మికులు హాజరై సంతోషంగా గడిపారు. అదేవిధంగా డిపోలో అత్యధిక కలెక్షన్ సంపాదించిన కండక్టర్లకు, ఇందనం పొదుపు చేసిన డ్రైవర్స్‌కు, మంచి నైపుణ్యం కలిగిన గ్యారేజ్ స్టాఫ్‌కి డిపో మేనేజర్ వెంకటేశం సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ పండరి, అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) ప్రశాంత్, అసిస్టెంట్ మేనేజర్(పర్సనల్) శేఖర్, సిబ్బంది, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కూల్చివేతలు

మణికొండ: ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలసిన మరికొన్ని నిర్మాణాలను రెవెన్యూ అధికారులు రెండవ రోజైన శుక్రవారం నేలమట్టం చేశారు. గండిపేట మండల పరిధిలోని వట్టినాగులపల్లి రెవెన్యూలోని సర్వే నెంబర్ 132లో కొందరు అక్రమంగా పెద్ద ఎత్తున నిర్మాణాలను చేపట్టారు. ఆ విషయంపై తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదులు రావటంతో వాటిని కూల్చివేయాలని సిబ్బందిని ఆదేశించారు. దాంతో గురువారం పది నిర్మాణాలను కూల్చివేశారు. మరికొన్నింటిలో కొందరు నివసిస్తుండటం, కొన్ని నిర్మాణాలను కూల్చకుండా స్థానికులు అడ్డుకోవటంతో గురువారం కొన్నింటిని వదలేశారు. శుక్రవారం గచ్చిబౌలి పోలీసుల బందోబస్తు తీసుకుని నిర్మాణాలలో ఉన్న వారిని కాలీ చేయించి అందులోని సామాగ్రిని బయట పెట్టించి నేలమట్టం చేశారు. తమకు నోటీసులు ఇచ్చి కూల్చాలని, అకస్మాత్తుగా కూల్చివేస్తే నిర్మాణాలలో ఉన్న వారు ఎటువెల్లాలని కొందరు అధికారులతో వాదించారు. కూల్చివేతలను అడ్డుకుంటే క్రిమినల్ కేసులు పెట్టాల్సి వస్తుందని అధికారులు బెదిరించటంతో స్థానికులు మిన్నకున్నారు. శుక్రవారం మొత్తం నాలుగు నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాల జోలికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, కబ్జాల వెనక ఎవరున్నారనే విషయాన్ని తెలుసుకుంటున్నామన్నారు. సూత్రదారులపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకి పంపే పనిలో ఉన్నామన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

జిల్లా ఇంచార్జి మంత్రిని కోరిన కాంగ్రెస్ నాయకులు


మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన మణికొండ కాంగ్రెస్ నాయకులు

మణికొండ: నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించి వారికి ఉపశమనం కలిగించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబును మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు కోరారు. శుక్రవారం ఆయనను కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో వారు ఆయనను కలిసి ప్రజా సమస్యలను ఆయనకు వివరించి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో అసంపూర్తిగా నిలిచిపోయిన నెక్నాంపూర్ చెరువు సుందరీకరణ, తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతుండటంతో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు, అశోకా లివియానా అపార్ట్‌మెంట్‌కు ఫీజు కట్టినా కనెక్షన్ ఇవ్వకుండా అధికారులు పెడుతున్న ఇబ్బంది, ఆర్‌ఎంసీ ప్లాంట్లతో ప్రజలు దుమ్ము, ధూళి, శబ్దాలతో పడుతున్న ఇబ్బందులు, కనెక్టింగ్ రోడ్లు లేక ప్రజల ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు పార్టీ అధ్యక్షుడు తెలిపారు. ప్రతి సమస్యపై కూలంకషంగా వివరించి వాటిని పరిష్కరిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రికి వివరించామన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం శ్రమించిన నాయకులకే నామినేటెడ్ పదవులను ఇవ్వాలని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామి ఇచ్చారని ఆయన వివరించారు. పార్టీ మున్సిపల్ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్‌లు కె. లక్ష్మీనారాయణ, డి.పురుషోత్తం, నాయకులు ముత్యాలు, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చందానగర్: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గోపన్‌పల్లి తండా చెరువులో ఓ వ్యక్తి (30) మృతి చెందాడని శుక్రవారం ఉదయం 6 గంటలకు పోలీస్ పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం అందింది. దీంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

గృహిణి ఆత్మహత్య


స్రవంతి (ఫైల్)

చందానగర్: భర్త వేధింపులు భరించలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. చందానగర్‌లోని శంకర్‌నగర్‌కు చెందిన నర్సింగ్‌రావు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతని భార్య స్రవంతి (35) బంగారు దుకాణంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. గురువారం నర్సింగరావు పిల్లలను పాఠశాలల వద్ద దించేసి ఉద్యోగానికి వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్రవంతి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె సోదరుడు సుధీర్‌కుమార్ నర్సింగ్‌రావు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఇంటికి వచ్చాడు. ఈ మేరకు చందానగర్ పోలీసులను ఆశ్రయించి స్రవంతి మృతిపై నర్సింగ్‌రావు తన సోదరిని నిత్యం వేధిస్తున్నాడని అతనిపైనే అనుమానం ఉందని తెలిపాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విరాళాల సేకరణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా శుక్రవారం సాయంత్రం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి, నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై సీపీఎం నిరంతరం ఉద్యమిస్తుందని తెలిపారు. నాయకులు మని రాజు, మల్లయ్య, మల్లేష్ పాల్గొన్నారు.